www.kalamdaily.com
Follow on: Kalamtelugu

# కలం
ప్రజల గళం...

22-02-2026, ఆదివారం   పేజీలు: 2

360° SINGLE TOPIC

## అమీర్‌పేట్ సెంటిమెంట్

# పేరుకే అమీర్‌పేట్

*అమీర్‌పేట్... ఐటీ కొలువుల ట్రైనింగ్‌కు అడ్డా! కంప్యూటర్ కోర్సుల ఇన్‌స్టిట్యూట్లకు కేరాఫ్ అడ్రస్! ఎన్నో ఆశలతో పల్లె నుంచి పట్టణానికి చేరే యువతకు స్టార్టింగ్ పాయింట్! ఇక్కడ గల్లీ గల్లీకి కోచింగ్ సెంటర్లు.. బిల్డింగ్‌ల నిండా ఊరించే ఉద్యోగాల బోర్డులు. 1990లో ఆరంభమైన అమీర్‌పేట్ ఐటీ ప్రస్థానం.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే!!*

అమీర్‌పేట్.. ఒకప్పుడు చిన్న ఊరు. కాలక్రమంలో హైదరాబాద్ విస్తరించడంతో సిటీ నడిబొడ్డున ఉన్న ప్రాంతంగా మారింది. కానీ అభివృద్ధిలో మాత్రం వెనుకబడే ఉంది. దీనికి పక్కనే ఉన్న ప్రాంతాలు ఎంతో డెవలప్ అయినా.. ఇది మాత్రం ఇంకా నైంటీస్ దగ్గర్నే ఆగిపోయింది.

*ఐటీ జాబ్స్ కొట్టేందుకు అమీర్‌పేట్ శిక్షణా కేంద్రమైతే.. ఐటీ జాబ్స్ చేసేవాళ్లకు గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, రాయదుర్గం వర్క్ సెంటర్లు! ఆ సెంటర్లన్నీ అద్దాల మేడలతో అందంగా వెలిగిపోతున్నాయి. కానీ, పేరులో 'అమీర్' ఉన్నా.. అభివృద్ధిలో మాత్రం గరీబ్‌గానే మిగిలిపోయింది అమీర్‌పేట్! ఇప్పటికీ అవే ఇరుకు గల్లీలు.. అవే పెచ్చులూడిన భవనాలు.. అవే ట్రాఫిక్ తిప్పలు..!! ఇటీవల జరిగిన అగ్నిప్రమాదమే అక్కడి దుస్థితికి సాక్ష్యం.*

*అమీర్‌పేట్‌పై కలం 360 డిగ్రీస్ స్పెషల్..*

తెలంగాణ బ్యూరో, కలం




### జాగీర్దార్ అమీర్ అలీ పేరుతో..

నిజాం కాలంలో 18వ శతాబ్దంలో జాగీర్దార్ అమీర్ అలీపేరు మీద అమీర్‌పేట్ ఏర్పాటైందని చరిత్రకారులు చెబుతున్నారు. అప్పట్లో ఇది పంట పొలాల మధ్యలో ఉండే చిన్న ఊరు. కాలక్రమంలో సిటీ విస్తరించడంతో ఇప్పుడు హైదరాబాద్ నడిబొడ్డున మైలురాయిగా నిలిచింది.

నైంటీస్ దగ్గరే ఆగిన కొలువుల కోట డెవలప్‌మెంట్

హైదరాబాద్ నడిబొడ్డున ఉన్నా.. ఏమీ మారలే

అవే ట్రాఫిక్ జామ్‌లు.. ఇరుకు గల్లీలు..

తాజా అగ్నిప్రమాదంతో ఉలిక్కిపడ్డ స్థానికులు




వానొస్తే వరదే.. పాగొస్తే పరుగే..! 2వ పేజీలో

కలం
ప్రజల గళం...
360° SINGLE TOPIC
22-02-2026, ఆదివారం


# అమీర్‌పేట్ సెంటిమెంట్

ఒకవైపు పంజాగుట్ట.. మరోవైపు బల్కంపేట ఎల్లమ్మ.. అటు వెళ్తే కూకట్‌పల్లి.. ఇటు వెళ్తే కృష్ణానగర్.. మధ్యలో నైంటీస్ నాటి ఐటీ బూమ్‌కు సజీవ సాక్ష్యంగా నిలబడి ఉన్న ప్రాంతమే అమీర్‌పేట్! హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఈ ఏరియానే అభివృద్ధికి ఆమడ దూరంలో ఆగిపోయింది. దేశంలోనే కంప్యూటర్ కోర్సుల ఇన్‌స్టిట్యూట్లకు ఫేమస్ ఏరియా ఏదంటే ముందుగా గుర్తుకు వచ్చేది అమీర్‌పేట్! వివిధ రాష్ట్రాల నుంచి యువత ఇక్కడికి వస్తుంటారు. వందలాది ఇన్‌స్టిట్యూట్లు, వేలాది మంది విద్యార్థులతో ఇదొక మినీ ఐటీ హబ్‌ను తలపిస్తుంటుంది. ఇక్కడ ఐటీ కోర్సులు నేర్చుకుని, కొలువులు సాధించినవాళ్లు వేలు, లక్షల్లో ఉన్నారు. అమీర్‌పేట్‌లో ప్రయాణం ప్రారంభించి, అమెరికా దాకా చేరినవాళ్లూ ఎంతో మంది ఉన్నారు. సిలికాన్ వ్యాలీలో పని చేసే చాలామంది భారతీయుల రెజ్యూమ్స్‌లో ఎక్కడో ఓచోట అమీర్‌పేట పేరు ఉండే ఉంటుంది. ఇక్కడి ఇన్‌స్టిట్యూట్లలో నేర్చుకున్న జావా, పైథాన్ వంటి కోడింగ్ కోర్సులే వాళ్లను డాలర్ల లైఫ్‌లోకి తీసుకెళ్లాయి. కానీ, ఇప్పటికీ ఈ ప్రాంతం సమస్యలతో సతమతమవుతూనే ఉంది. చిన్న చినుకుపడినా ఏరులై పారే రోడ్లు.. చిన్న షార్ట్ సర్క్యూట్ జరిగినా భారీ ప్రాణనష్టం జరిగే పాత భవనాలు.. ఎటు చూసినా ట్రాఫిక్ జామ్స్.. అదో సమస్యల నిలయం.

## చాయ్ పే చర్చలు..

ఏ యూనివర్సిటీలో లేని స్పెషాలిటీ అమీర్‌పేట్‌లో ఉంది. ఇక్కడికి ఎలాంటి ఐటీ బ్యాక్‌గ్రౌండ్ లేని వ్యక్తి వచ్చినా.. రెండు, మూడు నెలల్లో క్రాష్ కోర్సులతో ఐటీ ప్రొఫెషనల్ అయిపోవచ్చు. ఇక్కడ ఉండే మైత్రీవనం బిల్డింగ్ ఐటీ అభ్యర్థులకు ఒక కలల సౌధం. ఇది వేలాది మంది కెరీర్‌కు పునాది వేసింది. ఈ ప్రాంతంలో ప్రతి సందులోనూ లెక్కలేనన్ని హాస్టల్స్, టీ స్టాల్స్ ఉంటాయి. ఇవన్నీ యువత చర్చలకు వేదికలు. ఎక్కడికి వెళ్లినా.. 'ఏ కోర్సులో జాయిన్ అయ్యావు? ఏ ఇన్‌స్టిట్యూట్‌లో చేరావు?' అనే ప్రశ్నలే వినిపిస్తాయి.







## అమెరికా వీసాకు గేట్ వే

మన దేశంలో 1990లో ఐటీ బూమ్ మొదలైంది. అప్పటి నుంచి ఐటీ జాబ్ కొట్టాలని హైదరాబాద్‌లో అడుగుపెట్టే ప్రతి యువకుడి స్టార్టింగ్ పాయింట్ అమీర్‌పేటే అయింది. సాఫ్ట్‌వేర్ కోర్సులైన SAP, Java, Python, Testing, DevOps, Data Science వంటివి నేర్చుకునేందుకు ఇదొక అడ్డాగా మారింది. ఇక్కడ ఐటీ కోర్సులు నేర్చుకుని కొలువులు సాధించి అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ వంటి దేశాలకు వెళ్లినోళ్లు వేలాది మంది ఉన్నారు. అందుకే అమీర్‌పేట్‌ను 'అమెరికా వీసాకు గేట్‌వే' అంటారు.



## వానొస్తే వరదే..

అమీర్‌పేట్‌లో వానాకాలంలో కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. మైత్రీవనం, బుద్ధనగర్, గంగుబాయి బస్తీ, బల్కంపేటలో వరద వస్తున్నది. అమీర్‌పేట్–పంజాగుట్ట మెయిన్ రోడ్డులో నీళ్లు నిలిచి భారీగా ట్రాఫిక్ జామ్ అవుతున్నది. గత వానాకాలంలో మైత్రీవనం, బుద్ధనగర్, గంగుబాయి బస్తీ, బల్కంపేటలో పెద్ద ఎత్తున వరద వచ్చింది. ఆ ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ఇండిపెండెంట్ ఇండ్లు తక్కువ..

అమీర్‌పేట్‌లో ఇండిపెండెంట్ ఇండ్లు చాలా తక్కువ. ఇది పూర్తిగా కమర్షియల్ ఏరియా. చాలా బిల్డింగులు కమర్షియల్+రెసిడెన్షియల్‌గా మిక్స్ అయి ఉంటాయి. ఒక్కో బిల్డింగ్ కనీసం 4 అంతస్తుల నుంచి 10 అంతస్తుల వరకు ఉంటుంది. అక్కడక్కడ చిన్న గేటెడ్ కమ్యూనిటీలు కనిపిస్తాయి. చాలా వరకూ పాతవే ఉంటాయి. ఇక హాస్టళ్లు, పీజీలు(పేయింగ్ గెస్ట్) లెక్క లేనన్ని ఉన్నాయి.

## బతుకుదెరువూ నేర్పుతది...

అమీర్‌పేట్.. కేవలం సాఫ్ట్‌వేర్ కోర్సులు మాత్రమే కాదు.. బతకడం ఎలాగో కూడా నేర్పుతుంది. మధ్య తరగతి జీవితాలకు ఇదొక ప్రతిబింబంగా నిలుస్తుంది. ఓవైపు హాస్టళ్లు, మరోవైపు రూమ్స్‌లో ఉంటూ కోర్సులు నేర్చుకునే ఎంతోమంది యువతీ యువకులు మనకు ఇక్కడ కనిపిస్తుంటారు. రూమ్స్‌లో ఉండే యువత అన్నం వండుకుని, బయట కర్రీ పాయింట్ల నుంచే కూరలు తెచ్చుకుంటుంటారు.




## 3 వేల కోచింగ్ సెంటర్లు..

అమీర్‌పేట్‌లో అన్ని రకాల ఐటీ కోర్సుల కోచింగ్ సెంటర్లు కలిపి 3 వేల దాకా ఉన్నట్టు అంచనా. వీటిల్లో లక్షకు పైగా స్టూడెంట్లు ట్రైనింగ్ తీసుకుంటున్నట్టు ఓ లెక్క. అమీర్‌పేట్ మెయిన్ రోడ్డు, మైత్రీవనం, సత్యం థియేటర్ (ఇప్పుడు పేరు మారింది) ఏరియాల్లోనే ఎక్కువగా కోచింగ్ సెంటర్లు ఉన్నాయి.




# అమీర్‌పేట్ Vs రాయదుర్గం

| అమీర్‌పేట్ | రాయదుర్గం |
|---|---|
| సాఫ్ట్‌వేర్ కోర్సులకు కేరాఫ్ | ఐటీ కంపెనీలకు ఫేమస్ |
| మధ్య తరగతి ప్రజలు, విద్యార్థుల హాస్టల్స్ ఎక్కువ | ఐటీ ఎంప్లాయ్స్, లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాలు ఎక్కువ |
| అందుబాటు ధరల్లో వస్తువులు దొరుకుతాయి | పబ్స్, మాల్స్, రెస్టారెంట్ల లాంటి ఖరీదైనవి ఉంటాయి |

హైదరాబాద్‌లోని అమీర్‌పేట్, రాయదుర్గం మధ్య దూరం 10 కిలోమీటర్లు మాత్రమే. ఈ రెండు ప్రాంతాలను మెట్రో రైల్ బ్లూలైన్ కలుపుతుంది. కానీ, ఇవి రెండు విభిన్న ప్రపంచాలుగా కనిపిస్తాయి. అమీర్‌పేట ఇంకా 1990లోనే ఉంది. ఇది పెచ్చులూడిన పాత భవనాలు, చిన్న కంపెనీలు, ప్రభుత్వ ఆఫీసులతో అలాగే ఉండిపోతే... రాయదుర్గం అద్దాల మేడలు, ఐటీ పార్కులతో 21వ శతాబ్దానికి ప్రతిబింబంగా నిలుస్తున్నది. అమీర్‌పేట్ టిఫిన్ సెంటర్లు, కర్రీ పాయింట్లు, మెస్‌లు, టీ షాప్‌లకు ఫేమస్ అయితే.. రాయదుర్గం కేఫ్‌లు, రెస్టారెంట్లకు కేరాఫ్ అడ్రస్. ఇది ఒక ప్రపంచం నుంచి మరొక ప్రపంచానికి ప్రయాణించడం లాంటిది. కానీ, వీటితో ఇంకా ఏదో కనెక్ట్ అవుతోంది. అమీర్‌పేట్‌లోని కంప్యూటర్ శిక్షణ కేంద్రాలకు ఎందరో విద్యార్థులు వెళ్తుంటారు. రాయదుర్గంలోని అద్దాల మేడల ఐటీ కంపెనీల్లో జాబ్‌లు కొట్టాలని కలలు కంటుంటారు. అందుకోసం ఇరుకైన తరగతి గదుల్లో గంటల కొద్దీ కూర్చుంటారు.. గల్లీ హాస్టళ్లలో ఉంటుంటారు. ఇవన్నీ ఒక కల సాకారం కోసమే.! అక్కడి నుంచి మాదాపూర్, గచ్చిబౌలిలోని ఐటీ కంపెనీల్లోకి వెళ్లాలని కలల కంటుంటారు. సాఫ్ట్‌వేర్ కంపెనీల ఐడీలను మెడలో వేసుకుని తిరుగుతూ.. విలాసవంతమైన రెస్టారెంట్లు, కేఫ్‌లలో తినాలని ఆశ పడుతుంటారు. కానీ, వాస్తవంలో ఇది వేరేగా ఉంటుంది. కొందరు మాత్రమే సైబరాబాద్ వరకు ప్రయాణం చేయగల్గుతారు. మరికొందరు శిక్షణ సంస్థల్లోనే అధ్యాపకులుగా చేరుతుంటారు. అమీర్‌పేట నుంచి రాయదుర్గం అనేది మరొక భారత్ కథ లాంటిది.

(అమీర్‌పేట్, రాయదుర్గం ప్రాంతాలను పోలుస్తూ సోషల్ మీడియా 'ఎక్స్'లో ఓ యూజర్ పెట్టిన పోస్టు ఇదీ)

## ట్రాఫిక్ రద్దీ..

ఐటీ కోర్సులకు ఫేమస్ అయిన అమీర్‌పేట్ అంతగా అభివృద్ధి చెందలేదు. దీనికి పక్కనే ఉండే పంజాగుట్ట, శ్రీనగర్ కాలనీ, ఎస్ఆర్ నగర్ తదితర ప్రాంతాలు డెవలప్ అయినప్పటికీ.. ఇది మాత్రం 30 ఏండ్లుగా అట్లనే ఉంది. ఒక్క మెట్రో రైల్ వచ్చింది తప్పితే.. ట్రాఫిక్ ఇబ్బందులు మాత్రం తప్పింది లేదు. ముఖ్యంగా పంజాగుట్ట నుంచి అమీర్‌పేట, మైత్రీవనం వరకు వెళ్లే మెయిన్ రోడ్డులో ప్రతిరోజూ భారీ ట్రాఫిక్ జామ్‌లు సర్వసాధారణం.



## బిల్డింగుల్లో ఫైర్ సేఫ్టీ కరువు

అమీర్‌పేట్‌లోని ఒక్కో బిల్డింగ్‌లో పదుల సంఖ్యలో కోచింగ్ సెంటర్లు, చిన్న చిన్న కన్సల్టెన్సీ కంపెనీలు నడుస్తున్నాయి. చాలా వాటికి ఒక్కటే ఎంట్రీ, ఎగ్జిట్ ఉన్నాయి. దాదాపు ఏ బిల్డింగులోనూ ఫైర్ సేఫ్టీ పరికరాలు లేవు. అగ్నిప్రమాదాలు జరిగి, విద్యార్థులు భవనాల్లో చిక్కుకున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

- ఇటీవల మైత్రీవనం చౌరస్తాలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ బిల్డింగ్‌లో ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు అంటుకుని, మూడు ఫ్లోర్ల వరకు వ్యాపించాయి. మంటలను ఆర్పేందుకు ఎలాంటి ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకపోవడంతో.. ఆ బిల్డింగ్‌లోని కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు భయంతో పరుగులు పెట్టారు.
- వెనుక ఉన్న మెట్ల మార్గం నుంచి కొంతమంది బయటపడ్డారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని నిచ్చెనలు వేసి మిగతా వాళ్లను కాపాడారు.

